జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 19-11-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 515 పేజీలు: 4 వెల : రూ.7

# అర్ధరాత్రి అడ్డగోలు నిర్మాణాలు



* టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది అండతో విరుద్ధంగా నడుస్తున్న వ్యవహారాలు * మున్సిపాలిటీకి గిఫ్ట్‌గా ఇచ్చిన స్థలంలోనే నిర్మాణాలు * ఇలిసిపురం భద్రమ్మ గుడి దగ్గర అక్రమ నిర్మాణం * స్థల వివాదంపై కోర్టుకు వెళ్లిన బాధితులు * కాసులు అందడంతో కళ్లుమూసుకున్న నగరపాలక సంస్థ అధికారులు



**శ్రీకాకుళం, నవంబరు 18 (వార్త):** శ్రీకాకుళం నగరంలో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు అర్ధరాత్రి పూట శరవేగంగా జరుగుతున్నాయి. ఉదయం పూట నిర్మాణం చేపడితే అడ్డుకుంటారని, అదే రాత్రిపూట గుట్టుచప్పుడుకాకుండా పనికానిచ్చేస్తున్నారు. ఈ అక్రమ భవన నిర్మాణదారులకు శ్రీకాకుళం నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది అండదండలు పుష్కలంగా ఉండడంతో నిర్మాణదారులు దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ అక్రమ భవన నిర్మాణం విషయమై కొందరు నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినప్పటికీ కొందరు టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు భారీగా కాసులు ముట్టడంతో దగ్గరుండీ మరి ఈ భవన నిర్మాణం చేయిస్తున్నారు. శ్రీకాకుళం నగరంలోని ఇలిసిపురం భద్రమ్మ గుడి జంక్షన్ సమీపంలో సానావీధి వద్ద ఓ స్థల వివాదంపై కోర్టులో కేసు నడుస్తోంది. అలాగే పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణం చేస్తున్న వ్యక్తి మాత్రం కోర్టు ఆదేశాలు, పోలీసుల హెచ్చరికలు బేఖాతర్ చేస్తున్నాడు. కోర్టులో కేసు నడుస్తున్న స్థలంలో అక్రమంగా నిర్మాణం జరుగుతున్నా నగరపాలక సంస్థ అధికారులు అడ్డుకోకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివాదాస్పద స్థలంలో నిర్మాణం జరుగుతున్న సమయంలో ఏదేనా ప్రమాదం, గొడవలు జరిగితే ఎవరు బాధ్యులవుతారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాసుల మత్తులో కొందరు నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బందికి కళ్లు మూసుకుపోయాయని పలువురు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు.



## తెప్ప బోల్తా పడి మత్స్యకారుడు మృతి

**పోలాకి/జలుమూరు, నవంబర్ 18(వార్త):** సముద్రంలో తెప్ప బోల్తా పడడంతో గుప్పిడిపేటకు చెందిన మత్స్యకారుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పోలాకి మండలం గుప్పిడిపేట నుంచి ముగ్గురు మత్స్యకారులు మంగళవారం ఉదయం సముద్రంలో వేటకు వెళ్లారు. వేట చేస్తున్న సమయంలోనే అలల ఉధృతికి తెప్ప బోల్తా పడింది. దీంతో చెక్క రాజయ్య మునిగిపోయాడు. మిగతా ఇద్దరు మత్స్యకారులు.. రాజయ్య మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా, సముద్రంలో వేటకు వెళ్లి మత్స్య కారుడు రాజారావు మృతి పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుని కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



## లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

* బస్సులో సిక్కోలువాసులు
* ఎనిమిది మందికి గాయాలు

**శ్రీకాకుళం, నవంబర్ 18(వార్త):** విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నందిగామ సమీపంలోని అనాసాగరం వద్ద మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొంది. ఈ ఘటనలో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. నందిగామ శివారు అనాసాగరం బైపాస్ వద్ద లారీని ట్రావెల్స్ బస్సు ఓవర్‌టేక్ చేస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఈ బస్సులో మొత్తం 20 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రుల్లో శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాలకు చెందిన ప్రయాణికులుగా గుర్తించారు. పోలీసులు వెంటనే ఘటనాస్థలికి వెళ్లి క్షతగాత్రులను నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు పంపించారు. బస్సు, లారీని క్రేన్‌తో తొలగించి జాతీయరహదారిపై ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

వాహనమిత్ర డబ్బులు పడలేదంటూ..

## ఆటో డ్రైవర్ సెల్ టవర్ ఎక్కి హల్‌చల్!

* ఎచ్చెర్ల మండలం యాతపేట వద్ద ఘటన
* నచ్చజెప్పి కిందకి దించిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది



**శ్రీకాకుళం, నవంబర్ 18(వార్త):** వాహనమిత్ర డబ్బులు పడలేదంటూ ఓ ఆటో డ్రైవర్ సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన ఘటన శ్రీకాకుళం నగరంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎచ్చెర్ల మండలంలో గల యాతపేట వద్ద మంగళవారం ఎచ్చెర్ల మండలంలోని బొంతలకోడూరుకి చెందిన దాసరి కళ్యాణ్ కుమార్ సెల్ టవర్ ఎక్కేశాడు. దీన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో వారితో పాటు శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. సెల్ టవర్ ఎందుకు ఎక్కి నిరసన తెలియ జేస్తున్నావని, వెంటనే కిందకు దిగాలని పోలీసులు ఓ యువకుడిని వారించారు. తనకి వాహన మిత్ర నిధులు జమకాకపోవడంతో ఆందోళనకి దిగినట్లుగా ఆటో డ్రైవర్ పేర్కొనడంతో వారంతా అవాక్కయ్యారు. వాహన మిత్ర సహాయంపై అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన పట్టించుకోలేదని వాపోయాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని కళ్యాణ్‌ను పోలీసులు నచ్చజెప్పి కిందకు దించారు. దీంతో కథ సుఖాంతం అయింది.



* కూతుర్ని ఉంచిన తల్లి * జూనియర్ సివిల్ జడ్జి చొరవతో బాలికకు విముక్తి
* తల్లి మానసిక పరిస్థితి బాగోలేకపోవడమే కారణం
* ఇద్దరికీ కౌన్సెలింగ్ * మైనర్ కుమార్తెకు స్టేట్ హోంకు * తల్లి భాగ్యలక్ష్మికి కేజీహెచ్‌కు తరలింపు



## రెండేళ్లుగా.. చీకటి గదిలోనే!



**ఇచ్ఛాపురం,నవంబర్ 18(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి చక్రపాణి వీధి లాలాపేట జంక్షన్‌లో ఉన్న ఓ ఇంట్లో తల్లి కన్నకూతురిని బయటకు వెళ్లకుండా రెండేళ్లుగా ఉంచిన ఘటన వెలుగులోకి వచ్చింది. జూనియర్ సివిల్ జడ్జి మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్మన్ పి.పరీష్ కుమార్ చొరవతో ఆ బాలికకు విముక్తి కలిగింది. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన ఊళ్ల భాగ్యలక్ష్మికి 2007లో కటక్ చెందిన నరసింహారాజుతో వివాహం జరిగింది. 2009లో ఓ బాలికకు భాగ్యలక్ష్మి జన్మనిచ్చింది. పదేళ్ల క్రితం భర్త మృతి చెందాడు. అప్పటినుండి ఆమె మానసికంగా కృంగిపోయింది. ఓ ప్రైవేటు పాఠశాలలో తన బిడ్డను చదివించింది. గత రెండేళ్లుగా బయట జరుగుతున్న సంఘటనలు చూసి తన బిడ్డకు ఏమవుతుందోనని భయపడి స్కూలుకి పంపకుండా ఇంట్లోనే ఉంచేసింది. ఇంటి నుంచి బయటకు కూడా పంపేది కాదు. ఇరుగు పొరుగు వారి ప్రశ్నిస్తే దుర్భాషలాడేది. దీంతో ఆ ప్రాంతవాసులు తమకెందుకులే అని ఊరుకుండిపోయారు. ప్రతినెలా వచ్చే పెన్షన్ డబ్బులతో తల్లి కుమార్తె ఇంట్లోనే ఉండేవారు. తల్లి బయటికి వెళ్తే ఇంటికి తాళం వేసి వెళ్లేది. ఎవరు తలుపులు తీసేందుకు సాహసం చేసేవారు కాదు. ఇంట్లో చీకట్లోనే వారు ఉండేవారు. కరెంట్ ఉన్నప్పటికీ చీకట్లోనే మగ్గేవారు. రెండేళ్లపాటు ఇలానే కొనసాగింది. అదే వీధిలో ఉన్న అంగన్వాడీ కార్యకర్త మంగళవారం సీడీపీవో రాజేశ్వరి దృష్టి ఈ విషయాన్ని తీసుకువెళ్లింది. సీడీపీవో ఇదే విషయాన్ని జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే తహశీల్దార్ ఎన్.వెంకటరమణకు, ఎంఈవో కె.అప్పారావుకు సమాచారం అందించారు. జడ్జి పరీష్ కుమార్, న్యాయవాది ఉలాల భారతిదివ్య, పేనల్ న్యాయవాది ప్రేమలత పట్నాయిక్, సీడీపీవో రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు అంతా కలిసి లాలాపేట జంక్షన్‌లో ఉంటున్న భాగ్యలక్ష్మి ఇంటికి వెళ్లారు. తలుపులు ఎంత కొట్టినా ఆమె తీయలేదు. కోర్టు కానిస్టేబుల్ తలుపులు గట్టిగా కొట్టి సర్వే కోసం వచ్చామని చెప్పటంతో ఆమె తలుపు తీసింది. దీంతో అధికారులంతా ఆ ఇంట్లోకి వెళ్లారు. ఇల్లంతా చీకటిగా ఉండడాన్ని చూసి వారంతా ఆశ్చర్యపోయారు. తల్లీ, కుమార్తెను కోర్టుకు తీసుకువచ్చారు. వారి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికను స్టేట్ హోంకు తరలించారు. తల్లిని కేజీహెచ్‌కు మెరుగైన వైద్య చికిత్స కోసం తరలించారు.





## కర్రెన్న కుటుంబానికి న్యాయం చేయండి

* ఆసుపత్రి ఎదుట బంధువులు, జనసైనికుల నిరసన * కుటుంబీకులతో చర్చించిన పోలీసులు

**మెళియాపుట్టి, నవంబరు 18 (వార్త):** మెళియాపుట్టి మండలంలో గల జలకలింగుపురం గ్రామానికి సమీపంలో గల శ్రీ అనిల్ క్రాంతి ప్రసాద్ పొద్దార్ గ్రానైట్ క్వారిలో సోమవారం సాయంత్రం రానా కర్రెన్న అనే కార్మికుడు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం టెక్కలి జిల్లా ఆసుపత్రి ఆవరణలో భార్య పిల్లలతో పాటు బంధువులు, గ్రామస్థులు, జన సైనికులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే కర్రెన్న మృతి చెందాడని ఆరోపించారు. బాధిత కుటుంబాన్ని యాజమాన్యమే ఆదుకోవాలని నినాదాలు చేశారు. కర్రెన్న (మృతి చెందడంపై పలు అనుమానాలు ఉన్నాయని సర్పంచ్ ప్రతినిధి రవ్వల గణపతి, జనసేన నాయకుడు దుక్క బాలరాజు, గ్రామ యువజన సంఘం నాయకుడు కొల్లి వాసు అన్నారు. కర్రెన్న మృతిపై వాస్తవాలు తేల్చాలని డిమాండ్ చేశారు. పాతపట్నం సీఐ సన్యాసినాయుడు, మెళియాపుట్టి ఎస్ఐ రమేష్‌బాబు ఆసుపత్రి వద్దకు వచ్చి వారితో చర్చలు జరిపారు.

## ఎయిర్‌పోర్ట్ వివాదం

* తక్షణమే రద్దు చేయాలని రైతుల డిమాండ్ * పోలీసుల అధీనంలో ఉద్దానం * బిడిమిలో బాధిత రైతుల ప్రత్యేక సమావేశం

2లో

## 50 నాటుసారా ప్యాకెట్లతో ఇద్దరు అరెస్టు



**కొత్తూరు, నవంబరు 18 (వార్త):** మండలంలోని మెట్టూరు బిట్ 1 ప్రాంతంలో మంగళవారం కొత్తూరు పోలీసులు అక్రమ మద్యం రవాణాపై ఉక్కుపాదం మోపారు. స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ కె.వెంకటేష్ తన సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహనాల తనిఖీల్లో సుమారు 50 నాటుసారా ప్యాకెట్లు కలిగి ఉన్న ఒక వాహనాన్ని పట్టుకున్నారు. పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఆ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అందులో నాటుసారా నిల్వలు బయటపడ్డాయి. అయితే, వాహనంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి వాహనాన్ని వదిలి పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంటనే స్పందించిన ఎస్.ఐ. వెంకటేష్, పోలీసు సిబ్బంది పారిపోతున్న వారిని చాకచక్యంగా వెంబడించి పట్టుకున్నారు. కొత్తూరు మండలం, డెప్పిగూడ కు చెందిన సవర ముఖలింగం కాగా మరొకరు మెట్టూరు కు చెందిన ధర్మారావులుగా గుర్తించారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నాటుసారా ప్యాకెట్లు, వాహనాన్ని సీజ్ చేశారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నషాముక్త్ భారత్ అభియాన్

**పలాస, నవంబరు 18(వార్త):** మాదకద్రవ్య రహిత భారత్ ను సాధించేందుకు ఏర్పాటయిన నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.నరసింహమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మధుర చరిత్రకారుడు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, తమ్మినాన పాపారావు, అధ్యాపకుడు బి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.




## వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు



**మందస, నవంబరు 18(వార్త):** మందసలోని శాఖా గ్రంథాలయంలో సూర్యోదయ స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను గ్రంథాలయ అధికారిణి జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ముఖ్య అతిథిగా సూర్యోదయ స్కూల్ ప్రిన్సిపాల్ పిల్లి లోకేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ ప్రాముఖ్యం కోసం గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాల కోసం చక్కగా వివరించారు. పిల్లలు, పెద్దలకు గ్రంథాలయాలు ఎన్నో విధాలుగా ఉపయోగ పడతాయని చెప్పారు. మంచి గ్రంథాలు, కథల పుస్తకాలు, నీతి పుస్తకాలు, పోటీ పరీక్షలకు కావాల్సిన అన్ని రకాల పుస్తకాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తెలుగు టీచర్ బి.రమణ, పాఠకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## 104 మందికి కంటి పరీక్షలు



**మందస, నవంబరు 18(వార్త):** జిల్లా అంధత్వ నిర్మూలనా సంస్థ సౌజన్యంతో మందసలో భగవాన్ శ్రీసత్య సాయి సేవాసమితి(బృందావనం) ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి(శ్రీకాకుళం) కంటి వైద్య నిపుణులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య సహాయకులు అక్కురాడ కావ్య 104మందికి కంటి పరీక్షలు చేసి, వీరిలో 33మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కంటి రోగులకు మజ్జిగ, మంచినీళ్లు, పులిహోర నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జి టి.రామారావు, శ్రీ భగవాన్ సత్యసాయిబాబా సేవా సమితి కన్వీనర్ పూన్న ఈశ్వరరావు, వడ్డీ అప్పారావు, జోనల్ ఇన్‌చార్జి భైరాగి, సాయి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

### -టీడీపీ మండల అధ్యక్షుడు రవికుమార్



**జి.సిగడాం, నవంబరు 18(వార్త):** రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి సాధించేలా చూడడం యువతకు ఉద్యోగాలు అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ శ్రమిస్తున్నారని టీడీపీ మండల అద్యక్షులు కుమరాపు రవికుమార్ అన్నారు. విశాఖలో జరిగిన సీఐఐ సదస్సు సూపర్ హిట్ అవ్వడమే దీనికి తార్కాణమని చెప్పారు. విజయనగరం పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) కలిశెట్టి అప్ప నాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో పార్లమెంట్, నియోజకవర్గ అభివృద్ధి పరుగు సాధ్యమని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేఖరులతో సమావేశంలో మాట్లాడారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.19.25 లక్షల కోట్లకు పైగా విలువైన ఒప్పందాలు కుదిరాయన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ దేవదాయ శాఖ మంత్రికి బాలబ్రహ్మానంద స్వామి ఆశీస్సులు



**ఇచ్ఛాపురం, నవంబరు 18(వార్త):** తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా భాగ్య నగరంలో తెలంగాణరాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మరియు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖను వారి నివాసంలో బాలబ్రహ్మానంద సరస్వతీ (నైమిషారణ్య పీఠం అధిపతి) ఆశీస్సులు అందించారు. బాలబ్రహ్మానంద సరస్వతీ గురూజీ పీఠం శేష వస్త్రాలు కప్పి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. తెలంగాణలో 100 దేవస్థానములలో ప్రవచనాలు పూర్తి చేసినట్లు స్వామీజీ తెలిపారు, తెలంగాణ దేవాలయాల అభివృద్ధికి తమవంతు సలహాలు సూచనలు చేయాల్సిందిగా మంత్రి కోరినట్లు స్వామీజీ తెలిపారు.

## అటవీ భూములలో అక్రమ నిర్మాణం.. అడ్డుకున్న అధికారులు

**పోలాకి, నవంబరు 18(వార్త):** గుప్పెడుపేట పంచాయతీ చిన కొవిరిపేట లో అటవీ భూములలో చేపడతున్న అక్రమ ఇంటి నిర్మాణాన్ని ఫారెస్ట్ అధికారి రంజిత్ మంగళవారం అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన ఒకరు ఫారెస్ట్ భూములను ఆక్రమించుకొని ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్న సమాచారం మేరకు ఆ నిర్మాణాన్ని నిలిపివేశారు. ప్రభుత్వ అటవీ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



# కాగుతున్న ఎయిర్‌పోర్ట్ వివాదం

- -తక్షణమే రద్దు చేయాలని రైతుల డిమాండ్
- -పోలీసుల అధీనంలో ఉద్దానం
- -బిడిమిలో బాధిత రైతుల ప్రత్యేక సమావేశం
- -ప్రజా సంఘాల నాయకుల అరెస్టు



**మందస, నవంబరు 18(వార్త):** ఉద్దానంలో నిర్మించ తలపెట్టిన కార్గో ఎయిర్ పోర్ట్ వివాదం మలుపులు తిరుగుతోంది. కార్గో ఎయిర్ పోర్ట్ మాకు వద్దని రైతులు, ప్రజా సంఘాల నాయకులు పట్టు పడుతుండగా.. నిర్మిస్తామని అధికార పక్షం చెబుతోంది. దీంతో ఉద్దానంలో భూములు కాపాడుకోవడానికి రైతులు భూపోరాటాన్ని చేపట్టారు. పోరాటం ఉధృతం చేస్తున్నారు. కాశీబుగ్గలోని ఉద్దానం ప్రాంతంలోని కార్గో ఎయిర్ పోర్ట్ బాధిత రైతుల నిర్ణయం మేరకు కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడు కొమర వాసు నేతృత్వంలో 18న పలాస ఆర్.డీ.ఓ కార్యాలయం వద్ద మహా ధర్నా చేయాలని నిర్ణయం తీసుకున్నారు. సమాచారాన్ని మీడియాకు విడుదల చేశారు. మహాధర్నా కోసం పోలీసుల నుంచి అనుమతి కోసం 11న కాశీబుగ్గ పోలీసులు దగ్గరకు వెళ్తే అనుమతి ఇస్తామని, కాలయాపన చేశారని ఉద్యమ నాయకులు ఆరోపించారు. కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, ప్రధాన కార్యదర్శి జోగి అప్పారావు, దున్న హరికృష్ణ, గుంటు రామస్వామి తదితరులను పోలీసు స్టేషన్ కి రప్పించుకొని, మీకు అనుమతి ఇవ్వడం లేదని తేల్చిచెప్పారు. దీంతో కార్గో ఎయిర్ పోర్ట్ బాధిత 18 గ్రామాల్లోని ప్రజల్ని పోలీసులతో ఉద్దానంలో మోహరించారు. కమిటీ నిర్ణయం మేరకు బిడిమి గ్రామంలోని జుత్తు జగన్నాయికులు కమిటీ భవనంలో అవకాశం మేరకు అందుబాటులో ఉన్న రైతులతో సమావేశం ఏర్పాటు చేసి, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలని వ్యతిరేకించారు. పలువురు రైతులు మాట్లాడుతూ మా భూములకు సంబంధం లేని కొందరు వ్యక్తులు పలాస ఆర్.డీ.ఓ.ను కలిసి వినతిపత్రం ఇచ్చి, కార్గో ఎయిర్ పోర్ట్ బాధితులకి అవహేళన చెయ్యడం, 70% ప్రజలు అనుకూలంగా ఉన్నారని లేనిపోని అపోహలతో అధికారులకి తప్పుడ్రోవ పట్టించారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని హెచ్చరించారు. మహిళలు మాట్లాడుతూ మా స్థిరాస్తి భూము ఒక్క సెంట్ కూడా ఇచ్చే పరిస్థితి లేదని అవసరం అనుకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి మా భూ హక్కులు కాపాడుకుంటామన్నారు. కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ సభ్యులు మాట్లాడుతూ పలాస ఆర్.డీ.ఓ. మా ఉద్యమాన్ని నిష్పక్షపాతంగా గమనించి స్థానిక ఎమ్మెల్యే శిరీష, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకు వెళ్లాలని, పచ్చని ఉద్దానంలో కార్గో ఎయిర్ పోర్ట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, రైతులకు మద్దతుగా ఇవ్వాలని కోరారు. ఉద్యమానికి సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ప్రజా సంఘాల నాయకులకి అరెస్ట్ చెయ్యడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే వారికి విడుదల చేయాలని సభలో నినాదాలు చేస్తూ పోలీసు వారికి రిక్వెస్ట్ చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, స్థానిక సర్పంచ్ పొట్టి ధర్మారావు, డా.వై.యస్.ఆర్.ఉద్యాన యూనివర్సిటీ మాజీ బోర్డ్ మెంబెర్ బత్తిని లక్ష్మణ్, రాంపురం మాజీ సర్పంచ్ బడి సాంబమూర్తి, జుత్తు భూపతి, దున్న హరికృష్ణ, చిత్త గున్నయ్య, తెప్పల గున్నయ్య, రత్నాల భీమరావు, పోతనపల్లి అరుణ, పోతనపల్లి కుసుమ, బత్తిని నాగవేణి, మామిడి తులసయ్య, గుంటు రామస్వామి, తిమ్మల హరిక్రిష్ణ, చిత్త హేమరాజు, దున్న రామారావు, జుత్తు గున్నయ్య, చొక్కరి ధర్మారావు, తెప్పల దానమ్మ, జుత్తు జానకమ్మ, దున్న రాములమ్మ, సందుపల్లి తులసమ్మ పాల్గొన్నారు.





## ప్రకృతి వ్యవసాయమే శరణ్యం



**మందస, నవంబరు 18(వార్త):** మనుషుల ఆరోగ్యం, భూమి సారవంతానికి ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారా యణ అన్నారు. మందసలోని రైతు సేవా కేంద్రంలో జరిగిన సమావేశం జరిగింది. రీజనల్ టీం ప్రకాష్, హేమసుందర్ సమక్షంలో ఆర్డీఎస్(రబీ డ్రయ్) షోయింగ్ కోసము 12రకాల విత్తనాలు కలిపి పెసర, మినుములు చల్లటానికి కోసం కిట్స్ తయారు చేశారు. రైతుల సమక్షంలో అపరాలు, నువ్వులో రైతు పంటల ప్రకారం కొన్ని రకాలజీవ వైవిద్య పంటలు, అనుబంధ పంటలు కలుపుకొని, పంటలు వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం పూజారి సత్యనారాయణ మాట్లాడుతూ పంటలలో జీవ వైవిధ్యం పెంచాలని, పాడై పోయిన భూమిని మళ్లీ మంచిగా తయారు చేసుకోవాలంటే.. ప్రకృతి వ్యవ సాయం ఒకటే శరణ్యమన్నారు. రైతుల సమక్షంలో పెసర, మినుములో వేసే కిట్స్, నువ్వులో వేసే కిట్స్ పంటల పరిస్థితి ప్రకారం కొన్ని రకాలు కలుపుకొనే విధంగా కిట్స్ తయారు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా భూమిని మరలా ఖరీఫ్ పంట వేసుకున్నంత వరకు భూమిని పంటలతో కప్పి ఉంచ వచ్చని, దీని ద్వారా భూమి పై నేరుగా సూర్యరశ్మి పడకుండా భూమి తేమ కోల్పోకుండా ఉంటుందన్నారు. భూమిలో పోషకాలు సమృద్ధిగా పెరుగుతా యని, రైతుకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. రబీ ఆర్డీఎస్ వెనుక వున్న శాస్త్రీయత గురించి రీజనల్ అధికారి ప్రకాష్ వివరించారు. కార్యక్ర మంలో రీజనల్ అధికారులు ప్రకాష్, హేమసుందర్, ఎన్ఎఫ్ శివాజీ, ఎంటీ సూర్యనారాయణ, ఎఫ్ఎంటీలు లక్ష్మణరావు, బాలకృష్ణ, సనత్ కుమార్, యూనిట్ ఇన్‌చార్జిస్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



**ఇచ్ఛాపురం, నవంబరు18(వార్త):** ఈనెల 15 ,16 తేదీలలో కాకినాడ సూర్య కళామందిర్‌లో జరిగిన 14వ సబ్ జూనియర్, కేడేట్, సీనియర్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో ఇచ్ఛాపురం టైక్వాండో విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఓవర్ 59 కేజీ కేడేట్ క్యాటగిరిలో పి వర్షిని బంగారు పతకం, సబ్ జూనియర్ విభాగంలో అండర్ 32 కేజీ కేటగిరిలో బి. ఏశ్విత బంగారు పతకం, అండర్ 25 కేజీ కేటగిరిలో బి. మోక్షిత్ సిల్వర్ మెడల్, అండర్ 29 కేజీ కేటగిరిలో బి.మోక్ష బ్రాంజ్ మెడల్, అండర్ 38 కేటగిరీలో హేమసాగర్ బ్రాంజ్ మెడల్, కే డేట్ విభాగంలో పిలక లాస్యన్ రెడ్డి, జి అభిరామ్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. సీనియర్ కేటగిరి లో ఓవర్ 73 కేజీలు అనపాన అను సిల్వర్ మెడల్, అండర్ 63 కేజీ కేటగిరిలో ఎస్ లక్ష్మణరావు బ్రాంజ్ మెడల్ సాధించారు. బంగారు పతకం సాధించిన పి.వర్షిని ఈనెల 20వ తేదీ నుంచి పంజాబ్ రాష్ట్రంలో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయింది. ఈ పతకాలను సాధించిన విద్యార్థులందరికీ స్థానిక తైక్వాండో క్లాస్ ఆవరణలో పిలక విజయ్‌కుమార్, సుగు ప్రేమ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

## ఫలితాలు ఎక్కువగా వచ్చేలా కృషి చేయండి



**మెళియాపుట్టి, నవంబరు 18(వార్త):** పదో తరగతి పరీక్షల్లో ఎక్కువ ఫలితాలు వచ్చేలా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ఫోకస్ చేయాలని అసిస్టెంట్ కమిషన్ ఎగ్జామినర్ చంద్రభూషణ్ అన్నారు. మండలంలో గల చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళవారం నాడు ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూనే విద్యార్థుల పరీక్షల నిర్వహణ, బుక్ లెట్స్, ప్రగతి కార్డ్స్ లో నమోదు అయిన మార్కులు, వారి గ్రేడింగ్, తరగతి గదిలో విద్యార్థుల ప్రగతి, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల మరియు తగతిగదుల పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ 2026 సంవత్సరంలో 10వ తరగతి పరీక్ష ఫలితాలలో విద్యార్థులకు మంచి భోదన చేసి, వంద రోజుల ప్రణాళిక వేసుకొని ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించే దశగా ప్రతి ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలన్నారు సూచించారు. ఈ సందర్శనంలో ఆయన తోపాటు డీఈవో ఆఫీస్ నుండి శ్రీను, సంతోష్, మండల విద్యాశాఖ అధికారులు దేవేందర్ రావు, పద్మనాభం, చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సలాన వ్యాసగీత, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస యోజనకు దరఖాస్తు చేసుకోండి

### -సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు

**పలాస, నవంబరు 18(వార్త):** ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంకు చేసుకోవాలని, ఈ పదంకు ఈనెల 30 వరకు ఉంటుందని సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు చెప్పారు. మంగళవారం పలాస కాశీబుగ్గ పరిధిలోగల వెలుగు కార్యాలయంలో (సెర్ప్) మండల మహిళా సమైక్య అధ్యక్షుకురాలు గండు శాంతమ్మ అధ్యక్షతన ప్రధాన మంత్రి ఆవాస యోజన గ్రామీణ ఆవాస ప్లస్ పై సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత స్థలం కలిగిన వక్తులు ఎవరైనా ఉంటే మీ గ్రామంలో వాళ్లకి ఈ పథకం గురించి తెలియజేయండని సూచించారు. సచివాలయంలో పరిధిలో గల ఇంజనీరింగ్ అసిస్టెంట్ దగ్గరకు వివరాలు తెలియజేయాలని, ఆధార్, సొంత స్థలం ఉన్నట్టు ప్రభుత్వం వారు ఇచ్చిన హామీ పత్రం, కాస్ట్ అండ్ ఇన్కమ్ ,బ్యాంకు పాస్ బుక్, ఫోన్ నంబర్ వివరాలు తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జాంబవతి, సీసీలు నాగమ్మ, తేజస్వరరావు, 40 మంది సీ ఎఫ్ ( వివోఏ) తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## వైఎస్సార్ సీపీ నేత జానకిరావు మృతి

**-అంత్యక్రియలకు హాజరైన సీదిరి దంపతులు**

**మందస, నవంబరు 18(వార్త):** లింబుగాం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, గ్రామీణ వైద్యుడు బదకల జానకిరావు(42) మంగళవారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి మెరుగైన చికిత్సకై తరలించారు. జానకిరావు చికిత్స పొందుతూ అక్కడే మరణించారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామం లింబుగాంనకు తీసుకువచ్చారు. జానకిరావు మృతి పట్ల మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. జానకిరావు పార్టీకి చేసిన సేవలు కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో జానకిరావు ఎంతో మంచి వైద్య సేవలు అందించారన్నారు. జానకిరావు అంత్యక్రియల్లో అప్పలరాజు, శ్రీదేవి దంపతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. మృతునికి భార్య వరలక్ష్మి, మనోహర్, ఆలియా పిల్లలున్నారు. జానకిరావు మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.



# అత్యంత వైభవంగా అయ్యప్ప మహా పడి పూజ

**-అధిక సంఖ్య లో పాల్గొన్న భక్తులు**

**-జనసేన కొరికాన దంపతుల ఆధ్వర్యంలో నిర్వహణ**

**ఎల్ఎన్ పేట/ హిరమండలం, నవంబరు 18 (వార్త):** హిరమండలం, గొట్టా బ్యారేజి జంక్షన్ లో మంగళవారం సాయంత్రం సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, జనసేన సీనియర్ నాయకురాలు కొరికాన భవాని దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహా పడి పూజ కార్యక్రమాన్ని అతి వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేరళ రాష్ట్రం నుంచి అయ్యప్ప స్వామి దేవాలయ అర్చకులు యం యన్ రేజికుమార్ సంబ్రూది హాజరై మేళతాళాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలతో మహా పడి పూజా మహోత్సవాన్ని ప్రారంభించారు. పాతపట్నం నియోజకవర్గ పరిధిలో ఉన్న పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో అయ్యప్ప స్వామి దీక్ష చేస్తున్న భక్తులు, భవాని భక్తులు, స్థానిక ప్రజలు ఈ పూజలో పాల్గొన్నారు. విద్యుత్ అలంకరణ నడుమ భజన పాటలు, శరణుగోషాలతో అత్యంత వైభవంగా పడి పూజా మహోత్సవాన్ని నిర్వహించారు.అయ్యప్ప స్వామి పూజ కోసం వేసిన ఆలయ నిర్మాణపు పూల అలంకరణలు, లైట్ సెట్టింగ్ లు ప్రతీ ఒక్కరికి ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా కొరికాన రవికుమార్, భవాని మాట్లాడుతూ అయ్యప్ప స్వామిపై అంకితభావంతో ఈ మహా పడిపూజను నిర్వహించామని,ఈ నియోజకవర్గ



ప్రజలు అష్ట ఐశ్వర్యాలు, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవితం సాగించాలని స్వామి వారిని ప్రార్థించామని వారు తెలియజేశారు. పూజానంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.ఎన్నడూ ఈ నియోజకవర్గం లో నిర్వహించలేని మహా పడి పూజ కార్యక్రమం కొరికాన రవికుమార్, భవాని దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని స్థానికులు అన్నారు. ఈ పూజా మహోత్సవానికి స్థానిక ప్రజలు, కొరికాన కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



**జలుమూరు, నవంబరు 18(వార్త):** మాదకద్రవ్యాల వినియోగం పట్ల యువత ప్రాథమిక స్థాయి నుంచి దూరంగా ఉండాలని ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ప్రసాదరావు పిలుపునిచ్చారు. మంగళవారం జలుమూరు జడ్పీ బాలికల పాఠశాలలో విద్యార్థులతో ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మత్తు పదార్థాల జోలికి పోవద్దని సూచించారు. హెచ్ఎం ఇప్పిలి వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జలుమూరులో వ్యాసరచన పోటీలు




**జలుమూరు, నవంబరు 18(వార్త):** జలుమూరు శాఖా గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మంగళవారం గ్రంథాలయ అధికారిని ఆర్ ఢిల్లీశ్వరి మాట్లాడుతూ.. జలుమూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో యువతపై మాదకద్రవ్యాల ప్రభావం అంశంపై పోటీలను నిర్వహించామన్నారు. పాఠశాల ఉపాధ్యాయుడు మెండ రామారావు మాట్లాడుతూ.. విద్యార్థులలో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు.

## నేడు సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



**జి.సిగడాం, నవంబరు 18(వార్త):** జి.సిగడాం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఉప సర్పంచ్లు,పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల అభివృద్ధి పనులు, పరిసరాలు పరిశుభ్రత పై దీమ్ 5 గ్రీన్ అండ్ గ్రీన్ ఒకరోజు శిక్షణ కార్యక్రమం బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో జి. రామకృష్ణారావు మంగళవారం విలేఖర్ల సమావేశంలో తెలిపారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఈ సమావేశానికి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## ఉపాధ్యాయులకు టీచ్ టూల్ శిక్షణ




**జలుమూరు, నవంబరు 18(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు టీచ్ టూల్ శిక్షణ తరగతులను ఏర్పాటు చేశామని ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎన్వీఆర్ఎస్ ప్రసాదరావు తెలిపారు. మంగళవారం జలుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణా తరగతులను ప్రారంభించారు. పాఠశాలల్లో విద్యార్థులను ఆకట్టుకునే విధంగా బోధన సామర్థ్యాలను తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. బోధనలో మెలకువలు కూడా వివరించామన్నారు.

## కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**జలుమూరు, నవంబరు 18(వార్త):** చల్లవానిపేట జిల్లా పరిషత్ హై స్కూల్ లో మంగళవారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అలుదు విజయ అంబికా యువజన సేవా సంఘం పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు చైర్మన్ చల్లా ఆనందరావు సంఘ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక హైస్కూల్ అధ్యాపకులు చల్ల దుర్గాప్రసాద్ ఎంపిటిసి ప్రతినిధి పొన్నాన విజయ కుమార్ పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి పోటీలో యస్వీతకు బంగారు పతకం



**ఇచ్ఛాపురం, నవంబరు 18(వార్త):** జ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ఆరవ తరగతి విద్యార్థిని బి యశ్విత రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టైక్వాండో పోటీలలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈనెల 15, 16 తేదీలలో కాకినాడలో 39 వ రాష్ట్ర స్థాయి టైక్వాండ పోటీలు జరిగాయి. 32 కేజీల బరువు లోపు బాలికల సబ్ జూనియర్ విభాగంలో యశ్విత పోటీ పడింది . ఈ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా జ్ఞాన భారతి పాఠశాల సెక్రటరీ, సీఈవో జోహార్ ఖాన్ ప్రార్థనా సమయంలో విద్యార్థుల సమక్షంలో యస్వితను అభినందించారు. మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. యశ్వితను ఆదర్శంగా తీసుకొని మిగిలిన విద్యార్థులు క్రీడలలో తమ ప్రతిభను చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి పండ, , మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కోటి సంతకాలకు విద్యార్థుల నుంచి స్పందన



**పోలాకి, నవంబరు 18(వార్త):** వైసీపీ ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణకు స్పందన లభిస్తోందని పోలాకి మాజీ డీసీసీబీ అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నేటి యువతకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇబ్బందులు తప్పవన్నారు.

## నేడు ఎంఎల్ఏ శిరీష భోగాపురం రాక

**మందస, నవంబరు 18(వార్త):** పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ఈ నెల 19(బుధవారం)న మందస మండలంలోని భోగాపురం గ్రామం రానున్నారని తెలుగుదేశం పార్టీ మందస మండల నాయకులు చెప్పారు. అన్నదాతసుఖీభవ, పీఎం కిసాన్ రెండవ విడత కార్యక్రమం, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించనున్నారన్నారు. పలాస నియోజకవర్గ స్థాయి కార్యక్రమం జరుగుతుందని, మందస మండలంలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీల ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు, అధికారులు హాజరు కావాలని వారు కోరారు.

# రైతు నుంచి ప్రతి ధాన్యపు గింజ కొంటాం

**చల్లవానిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**జలుమూరు, నవంబరు 18(వార్త):** చల్లవానిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోకుండా,ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలులో తేమశాతం, తూకాలను స్థానిక టెక్నికల్ అసిస్టెంట్ సాయంతో సరిచూసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు. ప్రతి రైతుకు కనీస మద్దతు ధర తక్షణమే అందించేలా ఎటువంటి విధాన పరమైన జాప్యాలు లేకుండా చూసుకోవాలని ఎలక్షన్ తో రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ కు వరి ధాన్యం సేకరణకు మొదలుపెట్టిందని తెలిపారు. ఈ సీజన్లో 51 లక్షల టన్నుల వరి ధాన్యాన్ని సేకరించాలని రాష్ట్రం ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ ప్రక్రియ కోసం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అంతటా 3,013 రైతు సేవా కేంద్రాలు, 2,061 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. నాణ్యతా ప్రమాణాల ఆధారంగా పారదర్శకంగా, ఇబ్బంది లేని విధంగా రైతుల నుండి ప్రతి వరి గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.అమ్మకం జరిగిన 48 గంటల్లోపు రైతుల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు జమ వుతాయని అన్నారు. గన్నీ బ్యాగులు, తేమ పరీక్ష యంత్రాలు, రవాణా సౌకర్యాలతో ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, సర్పంచ్లు, ఎంపీటీ సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు, తహశీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ అధికారులు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# రెంటికోట గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా

**ఎమ్మెల్యే శిరీష**



**పలాస, నవంబరు 18(వార్త):** రెంటికోట గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస మండలం రెంటికోట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం ప్రారంభించారు. రైతుల సేవ కోసం, వారికి అవసరమైన అన్ని వ్యవసాయ సదుపాయాలు, సహాయం ఒకే చోట లభించేలా ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, దీని ద్వారా రైతులకు మరింత సౌలభ్యం కలుగుతుందని, రైతు సమృద్ధి రాష్ట్ర సమృద్ధికి పునాది అని ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతే రాజు అనే నినాదానికి కట్టుబడి రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారాలు దిశగా ముందుకు తీసుకొని వెళ్లాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గత వైసిపి పాలనలో జరిగిన కొన్ని ఇబ్బందులు మరలా తలెత్తకుండా రైతులు వద్ద నుండి దాన్యం కొనుగోలు చేయాలని సూచనలు చేశారు. గత ప్రభుత్వం 13000 రూపాయలు ఇస్తే మా కూటమి ప్రభుత్వం సంవత్సరానికి 20,000 రూపాయలు అన్నదాత సుఖీభవ పథకం కింద ఈ రాష్ట్రంలో 4620000 మంది రైతుల ఖాతాలో రేపటి తేదీన జమ చేస్తుంది మా మంచి ప్రభుత్వం అని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని రెంటికోట గ్రామానికి సుందరంగా తీర్చిదిద్ది నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని స్థానిక టిడిపి నాయకులకు ఎమ్మెల్యే గౌతు శిరీష హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడి రామారావు, ఏవో, ఎమ్మార్వో కళ్యాణ్ చక్రవర్తి, ఎంపీడీవో వసంత్ కుమార్, పిఏసిఎస్ చైర్మన్ వంకల కూర్మారావు, రెంటికోట సర్పంచ్ తిరుమలరావు, మాజీ ఎంపీటీసీ, టిడిపి సీనియర్ నాయకులు హెూరియా మోహన్ రావు, పీరకట్ల విఠల్ రావు, లొడగల కామేష్ యాదవ్, తమినాన గంగారాం, గురుటి సూరి నారాయణ, దువ్వాడ సంతోష్, శ్రీహర్ష, కిక్కర ఢిల్లీ రావు, రాంబాబు, కద్దాల కృష్ణారావు, స్థానిక నాయకులు, స్థానిక సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టండి



**జలుమూరు, నవంబరు 18(వార్త):** జలుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లుతో సాధారణ సభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని, మార్కెట్ కమిటీ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. కార్యాలయంలో మీటింగ్ హాల్, రహదారులు, ప్రహరీ నిర్మాణానికి, గొడౌన్స్ వంటి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మార్కెట్ కమిటీ చైర్మన్ , డైరెక్టర్లు, వ్యవసాయ అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాలతో మెరుగైన సమాజం



**పలాస, నవంబరు 18(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో "సహకార సంఘాలతో మెరుగైన సమాజం" అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ "సహకార సంఘాలు సామాజిక-ఆర్థిక అభివృద్ధికి పునాది. ఇవి లక్షలాది మందికి విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ వంటి సంస్థల ద్వారా మంచి అవకాశాలు కల్పిస్తున్నాన్నారు. విద్యార్థులు సహకార వ్యవస్థల ప్రాధాన్యాన్ని అర్థం చేసుకొని వాటి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆమె సూచించారు. ఈ వారోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలైన ఐ.చామంతి, ఎస్.అను, పి.పావని విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ మూడు స్థానాల్లో కైవసం చేసుకొని, బహుమతులను గెలుపొందిన విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామకృష్ణ, జోనల్ మేనేజర్ శ్రీనివాస్, పలాస కోపరేటివ్ బ్యాంక్ మేనేజర్ కనక మహా లక్ష్మి, వాణిజ్య విభాగాధ్యక్షులు పి. వెంకటరమణ, సైన్స్ విభాగ అధ్యక్షులు శ్రీనివాస్ పట్నాయక్, అధ్యాపకులు విద్యార్థినీ, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అరెస్టయిన కామ్రేడ్స్‌ను వెంటనే విడుదల చేయండి

### - సిపిఐ యంయల్ లిబరేషన్ డిమాండ్




**పలాస, నవంబరు 18(వార్త):** మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో గల పచ్చని ఉద్దాన ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్ట్ మా కొద్దుని, మా భూములే మాకు ముద్దని గత సంవత్సరాకాలంగా రకరకాల పద్దతిలో ఉద్యమాలు, ప్రజాస్వామ్య బద్దంగా చేస్తుంటే ,గత పది రోజుల క్రితం మంగళవారం పలాసా ఆర్డీవో కార్యాలయం వద్ద ప్రజలు ,రైతులు వామ పక్ష నాయకులు ,ప్రజాసంఘాల అధ్వర్యంలో మంగళవారం 18 వ తారీఖున ధర్నా చేయుటకు సిద్ధపడ్డారు. విభజించు పాలించు పద్దతిలో కూటమి ప్రభుత్వం నిన్న ఆభూములకు సంబందలేని తెలుగుదేశం కార్యకర్తలతో ఎయిర్ పోర్టె కావాలని ధర్నా చేయించారనీ ,ఇది సరియైన పద్ధతి కాదని సిపిఐ యం యల్ లిబరేషన్ సీనియర్ నాయకులు కామ్రేడ్ మద్దిల మల్లేశ్వరరావు, డిమాండ్ చేసారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఆర్డీవోకి వినతి పత్రం అందజేయాలని, బాదిత రైతులు, పోరాట కమిటీ ప్రయత్న చేస్తే ఈ నిరంకుశ, నియుంత్రృవ్వ ప్రభుత్వం ఉక్కు పాదంతో ఉద్యమాన్ని తొక్కేందుకు ప్రయత్నాలతో విపరీతమైన పోలీసు బలగాలను దింపి అక్రమ అరెస్టులను చేసి, ప్రజలను భయభ్రాంతులు చేస్తున్న పరిస్తితిని సిపిఐ యంయల్ లిబరేషన్ జిల్లా కార్య ధర్శి కామ్రేడ్ తామాడ సన్యాసిరావు తీవ్రంగా ఖండించారు. సోంపేట పోలీస్ స్టేషన్ లో అరెస్ట్ కాబడిన సిపియం జిల్లా కార్యధర్శి కామ్రేడ్ గోవింద్, న్యూడెమొక్రసీ జిల్లా కార్యధర్శి కామ్రేడ్ వంకల మాధవరావులను వెంటనే విడుదల చేయాలని ఏఐకేయం జిల్లా నాయకులు కామ్రేడ్ మద్దిల రామారావు డిమాండ్ చేసారు. ఈ కార్యక్లమంలో కె.దుష్యంత్, పి అప్పారావు, కె.ఈశ్వరమ్మ, కె.లోకనాదం, పి.నాగేశ్వరరావు, కె.వల్లభరావు, యమ్. కైలాస్, జి.జగదీష్, తదితరులు పాల్గోన్నారు.

## ముగిసిన నవచండీ యాగ మహోత్సవాలు



**ఎల్ ఎన్ పేట, నవంబర్ 18(వార్త) :** కార్తీక మాస పర్వదినం సందర్భంగా లక్ష్మీనర్సుపేట గ్రామంలో వంశధార నదీ తీరాన వెలిసిన కోర్కెలు తీర్చే కల్పవల్లి బంగారమ్మ తల్లి గ్రామ దేవత అమ్మవారి గుడి ఆవరణలో మూడు రోజులు పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన నవచండీ సహిత రాజ శ్యామలా యాగ మహోత్సవాలు మంగళవారం ముగిసాయి. గ్రామానికి చెందిన వైశ్యరాజు చంద్రశేఖరరాజు, వైశ్యరాజు పాండురంగనాధరాజు, శ్రీనివాసరాజు సౌజన్యంతో గోపినంబాళ లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో లక్ష్మీ నర్సు పేట గ్రామ పురోహితులు నాగవరపు క్రిష్ణ శర్మ పర్యవేక్షణలో వనమాలి రామకృష్ణ శర్మ, బ్రహ్మశ్రీ జాడ.సతీష్ శర్మ, బ్రహ్మశ్రీ గోపి నాంబాళ శరత్ చంద్రాచార్యులు నేతృత్వంలో వేదపండితుల చే పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సామూహికంగా మహిళలు కుంకుమ పూజలు చేశారు. బంగారమ్మ తల్లి గ్రామ దేవతని సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పూజలు వీక్షించేందుకు గ్రామంలోని పలు కూడళ్లలో మైక్ సెట్లు ఏర్పాటు చేశారు.యాగ నిర్వహణ ప్రాంతం భారీ సెట్టింగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భారీ మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేసి అన్న ప్రసాదం స్వీకరించారు.యాగ మహోత్సవం విజయ వంతానికి సహకరించిన ప్రజలకు నిర్వాహకులు చంద్రశేఖర రాజు, పాండు రంగనాధ రాజు ధన్యవాదాలు తెలియజేశారు.

## నేడు ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ జిల్లాకు రాక



**శ్రీకాకుళం, నవంబర్18 (వార్త):** ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ బుధవారం శ్రీకాకుళం జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు విశాఖపట్నంలో బయలు దేరి 10 గంటలకు స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియానికి చేరుకుంటారు. అక్కడ కార్యక్రమాల అనంతరం పత్రికా ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటిగంటకు శ్రీకాకుళం నుండి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటారు.

# ఉడుకుతున్న ఉద్దానం

- -పోలీసుల వలయంలో గ్రామాలు
- -కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేకులు, ప్రజా సంఘాల నేతల నిర్బంధం
- -ఉద్యమకారుల కార్యక్రమం అడ్డగింత
- -రాజకీయ నేతలకు లేని ఆంక్షలు మాకెందుకంటూ ప్రజా సంఘాల ప్రశ్న



**పలాస, నవంబరు 18(వార్త):** ఉద్దానం గ్రామాలన్నీ పోలీసుల దిగ్బంధ చేసి పోలీసులు అదుపులోకి తీసుకువచ్చారు. మంగళవారం వేకువజామునుండి పోలీసులు జల్లెడ పట్టి కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక ఉద్యమకారులు నిరసనకు పిలుపునివ్వడంతో పోలీసులు పెద్ద సంఖ్యలో మొహరించి ఎక్కడికక్కడ బారికేట్లు ర్కెట్లు ఏర్పాటు చేసిపోలీసులు వలయంలో ఉద్దానం గ్రామాన్ని అదుపులోకి తీసుకున్నారు. కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేకులను నిర్బంధించి, ఎక్కడికక్కడే అడ్డుకున్న పోలీసులు తీరును ప్రజా సంఘాలు ముక్తకంఠంగా ఖండించాయి. రాజకీయ నేతల తీరుకు నిరసనగా నేటి కార్యక్రమం తలపెట్టామని ఉద్యమకారులు తెలిపారు. ఉద్యమకారుల కార్యక్రమాన్ని అడ్డుకున్న పోలీసులు, పోలీసుల తీరుపై మండిపడుతున్న కార్గో బాధితులు. రాజకీయ నేతలకు లేని ఆంక్షలు మాకెందుకంటూ ప్రజా సంఘాలు ప్రశ్నించాయి. ఉద్యమకారులను గ్రామాల నుంచి బయటకు రానివ్వకుండా అడ్డుకున్నారు. అడ్డంకులు దాటి బయటకు వచ్చిన వారిని అరెస్టు చేసి సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. మరోవైపు ఉద్యమ నేతలను హౌస్ అరెస్టులు చేశారు. పోలీసుల తీరుపై ఉద్యమకారులు, బాధిత గ్రామాల ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. రాజకీయ పార్టీలకు నేతలకు లేని ఆంక్షలు ఉద్యమకారులపై ఎందుకని ప్రశ్నిస్తున్నారు. సోమవారం ఆర్డిఓ ను కలిసి కార్గో ఎయిర్ పోర్టు పనులు వేగవంతం చేయారలని కోరిన రాజకీయ నేతలకు అనుమతి ఇచ్చిన పోలీసులు, అదే ఎయిర్ పోర్టును వద్దని అధికారులకు చెప్పేందుకు వెళుతున్న ఉద్యమకారులను ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పాలని వారంతా డిమాండ్ చేశారు. పోలీసులు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఈ తీరు సరికాదని మండిపడ్డారు. ఫలితంగా మంగళవారంవేకువజాము నుండి మధ్యాహ్నం వరకు ఉద్దాన ప్రాంతంలో అలజడి నెలకొంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఉద్దాన ప్రాంతంలో ఉత్కంఠ నెలకొంది. పోలీసులు ఉద్యమకారులను పలాస రాకుండా అడ్డు కొట్టు పోలీసులు సఫలీకృతమయ్యారని చెప్పొచ్చు.

## ప్రైవేట్ క్లినిక్‌లను ఆకస్మిక తనిఖీచేసిన పీవో






**కొత్తూరు, నవంబరు 18 (వార్త):** కొద్దిరోజుల క్రితం హడ్డుబంగి గ్రామానికి చెందిన గిరిజన బాలిక కవిత యాంటీబయాటిక్ మోతాదు అధికంగా ఇవ్వడంతో ప్రాణాలు కోల్పోయిన ఘటనపై ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పీవో కొత్తూరులోని ప్రైవేట్ క్లినిక్‌లపై ఆకస్మిక తనిఖీలు చేపట్టి నిర్లక్ష్య వైద్యం చేస్తున్న ఆర్‌ఎంపీలను గట్టిగా హెచ్చరించారు."ప్రాణాలతో ఆటలాడే వైద్యం అస్సలు సహించం. ఆర్‌ఎంపీలు ప్రాథమిక చికిత్సకే అర్హులు %-% ప్రాణాంతక కేసులు చికిత్స చేయడం చట్టవ్యతిరేకం," అని స్పష్టం చేశారు. యాంటీబయాటిక్స్, బలమైన ఇంజెక్షన్లు, అధిక మోతాదు మందులను అనర్హులు వాడుతున్నట్లు తనిఖీల్లో తేలడంతో రిజిస్టర్లు, మందుల రికార్డులు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ తనిఖీల్లో కురిగాం ప్రధాన వైద్యాధికారి డా. ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.తదుపరి పీవో కొత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది కొరత, వైద్య సేవల లోపాలను సమీక్షించారు. "గైనకాలజిస్ట్, మత్తుమందు నిపుణుడు, నర్సుల ఖాళీలను అత్యవసర ప్రాధాన్యంతో భర్తీ చేస్తాం. %జఎజ% పూర్తిస్థాయిలో పనిచేయాలి," అని తెలిపారు.అదేవిధంగా %జఎజ%లో చికిత్స చేయరాని ప్రమాదకర కేసులను తక్షణం రిఫర్ చేయాలని పీవో స్పష్టం చేశారు. రోగులను ప్రత్యక్షంగా పరామర్శించిన పీవో సేవల నాణ్యతపై సమగ్ర విచారణ జరిపారు. ల్యాబ్ పరికరాలు, డెలివరీ రూమ్, ఎమర్జెన్సీ సెటప్, నర్సింగ్ సేవలను సమీక్షించి తక్షణ మెరుగుదల సూచనలు ఇచ్చారు. "ప్రజల ఆరోగ్యం విషయంలో రాజీ పడేదిలేదని అలా ఏ వైద్యులు అయిన నిర్లక్ష్య వైద్యంపై కఠిన చర్యలు తప్పవు," అని పీవో తుది హెచ్చరికగా పేర్కొన్నారు.





## కొనసాగుతున్న జాతీయ సేవా శిబిరాలు

**మందస, నవంబరు 18(వార్త):** పితాతొలికాలనీ, ఉమాగిరి గ్రామాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్ కొనసాగింది. నిషా ముక్తభారత్‌లో భాగంగా మత్తు పదార్థాలను నిషేధించాలని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. జీఎస్టీ 2.0పై ధరలు సామాన్యులకు అందుబాటులో ఏ మేరకు తగ్గాయనే అంశంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

ముఖ్యంగా మెడికల్, అగ్రికల్చర్, చిన్న, సూక్ష్మ, మధ్య తరగతి ప్రజలకు కొనుగోలు శక్తి పెరగాలని ఉద్దేశంతో భారత ప్రభుత్వం జీఎస్టీ 2.0 తీసుకుని వచ్చిందని, ప్రజలందరికీ ఎంతో మేలు కలుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు కూడా వాణిజ్యపరంగా వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు కచ్చితంగా బిల్లులు చెల్లించేటప్పుడు జీఎస్టీ పన్ను విధింపు సక్రమంగా వ్యాపారులు అమలు చేస్తున్నారా లేదా అనే విషయంపై ప్రతి ఒక్కరు కూడా అవగాహన కలిగి ఉండాలని ఎస్బీఐ బ్యాంక్ మందస బ్రాంచ్ ఫీల్డ్ మేనేజర్ కె.నరేష్ వాలంటీర్స్‌కు వివరించారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్మార్ట్ మీటర్, సోలార్ విద్యుత్ శక్తిని ఏ విధంగా వాడాలో, ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీపై కూడా గ్రామస్తులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బొంగి ప్రవీణ్, పీఓ మన్మథరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.



## విద్యావేత్త సోమేశ్వరరావు మృతి



**మందస, నవంబరు 18(వార్త):** విద్యావేత్త, రిటైర్డ్ గ్రేడ్-2 ఉపాధ్యాయుడు, సామాజికవేత్త యెరుకోల సోమేశ్వరరావు మరణించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం కన్నుమూసారు. మందస మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన సోమేశ్వరరావు ఉపాధ్యాయునిగా మంచి సేవలందించారు. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది ఆయన శిష్యులే ఉన్నారు. హరిపురం, బహడపల్లి పాఠశాలలో ఎక్కువ కాలం ఉపాధ్యాయునిగా పని ఎందరో ఉత్తమ విద్యార్థులను తయారు చేశారు. పలు సేవా కార్యక్రమాలు చేశారు. తల్లి, దండ్రులు యెరుకోల గున్నయ్య, నరసింహమ్మ జ్ఞాపకార్థం హరిపురం హైస్కూలులో కళావేదిక నిర్మించారు. జీవితాంతం సేవా దృక్పథాన్ని అలవాటు చేసుకున్న ఆయన హరిపురం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టి మంచి పేరు సంపాదించారు. ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన ప్రతి పాఠశాలలో విద్యాబుద్ధులతో పాటు జీవన విలువలను నాటిన గురువుగా సోమేశ్వరరావు మాస్టారు ప్రసిద్ధి చెందారు. వేలాది మంది విద్యార్థులు ఆయన స్ఫూర్తితో ఉన్నత విద్యలు అభ్యసించి సమాజంలో ప్రతిష్టాత్మక స్థానాలు సంపాదించుకున్నారు. విద్య ప్రతి ఇంటి చేరాలని కలగన్న ఆ మహనీయుడు ఎన్నో మంది విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందించి అనేక కుటుంబాలకు ఆదర్శంగా నిలిచారు. పలు ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు చేసిన ఆయన ఈ ప్రాంతంలో మంచి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. సోమేశ్వరరావు మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు, నాయకులు, ఆయన శిష్యులు, స్థానికులు సంతాపం తెలిపారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



**శ్రీకాకుళం, నవంబరు 18(వార్త):** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం రూరల్ మండలంలో వాకలవలస, లంకాం పంచాయతీలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ధాన్యానికి సంబంధించిన పరిశీలనలన్నీ ధాన్యం రైతు సేవా కేంద్రాలు వద్దే జరుగుతోందన్నారు. రైతు సేవా కేంద్రం వద్ద స్లిప్పు ఇస్తారన్నారు. క్వింటాకు గ్రేడ్ - ఎ రూ.2389/-లు, గ్రేడ్ - బి రూ.2369, 80 కేజీలకు రూ.1895 ఉందన్నారు. రైతు సేవా కేంద్రాల నుండి కళ్లాలకు వచ్చి అక్కడ తేమను పరిశీలించి స్లిప్పులు ఇస్తారని అక్కడ నుండి రైస్ మిల్లులకు తీసుకువెళ్లొచ్చని వివరించారు. వాట్సాప్ ద్వారా సమాచారం ఇచ్చి ధాన్యం విక్రయాలు చేసుకోవచ్చని చెప్పారు. మండలంలో గతంలో 15 ధాన్యం కొనుగోళ్లు కేంద్రాలు ఉండగా ఈ యేడాది మరో నాలుగు కేంద్రాలు పెంచుతున్నామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు రైతులతో సానుకూల దృక్పథంతో ఉండాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ గణపతిరావు, సర్పంచ్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో వక్తృత్వ పోటీ

**శ్రీకాకుళం, నవంబరు 18(వార్త):** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వక్తృత్వ పోటీ నిర్వహించారు. రిటైర్డు మండల విద్యాశాఖాధికారి తలగాన లింగరాజు, ఢిల్లేశ్వరరావు, సోడవరం ఈశ్వర్ రాఘవ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వివిజి ఎస్ శంకర రావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ పివి భాస్కర్ రాజా, సిబ్బంది ప్రత్యూష, కళ్యాణి, వరలక్ష్మి, రాంబాబు, గణేష్ రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## ఎచ్చెర్లలో భారత్ అభియాన్ ర్యాలీ

**శ్రీకాకుళం, నవంబరు 18(వార్త):**కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మంగళవారం డా. బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో "నాషా ముక్త్ భారత్ అభియాన్" 5వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా, మాదకద్రవ్య దుర్వినియోగాన్ని సమిష్టిగా ఎదుర్కోవాలనే నినాదంతో సంకల్ప మరియు అవగాహన ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో డా. బీఆర్ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య బి. అడ్డయ్య, జిల్లా దివ్యాంగుల సంక్షేమ ఉప సంచాలకులు బి. శైలజ, వర్సిటీ ప్రిన్సిపాళ్ళు డా.ఎం.అనురాధ, డా. సిహెచ్. రాజశేఖర రావు, ఈగల్ సెల్ ప్రతినిధులు, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా. డి. వనజ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్యుని సన్నిధిలో మహాలింగార్చన

**శ్రీకాకుళం, నవంబరు 18(వార్త):**ప్రత్యక్ష దైవం ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి దేవస్థానంలోని మంగళవారం ఉదయం అనివెట్టి మండ పంలో స్వామివారికి శివ పంచాయతన సహిత మహాలింగార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546